సంక్షిప్తంగా..

రేపు భక్తిమాలిక పుస్తకావిష్కరణ.. సుభాష్‌నగర్, మార్చి 15: ప్రముఖ పద్యకవి తంగుడిగె శ్రీనివాసరావు రచించిన భక్తమాలిక పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నట్లు పద్య భారతి ప్రధాన కార్యదర్శి కాసర్ల నరేశ్‌రావు తెలిపారు. నగరంలోని సాయినగర్ దత్త ఆశ్రమంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ఉంటుందని, సాహితీ ప్రియులు పాల్గొనాలని కోరారు.

ఉపాధి కేంద్రాల పరిశీలన.. కోటగిరి మార్చి 15: మండలంలోని సుద్దులం, రాంపూర్ తదితర గ్రామాల్లో ఎంపీడీవో మనోహర్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. ఉపాధి కోసం బీసీ రుణాలతో ఏర్పాటు చేసుకున్న వ్యాపారాలు, కుటీర పరిశ్రమలను పరిశీలించారు.

పట్టా భూములను చూపించాలి.. ధర్పల్లి, మార్చి 15 : మండలంలోని ప్రాజెక్టు రామడుగు గ్రామంలో పేదలకు 20 ఏండ్ల క్రితం ప్రభుత్వం పట్టాలను పంపిణీ చేసిందని, అందుకు సంబంధించిన ప్లాట్లను వెంటనే చూపించాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ మాలతికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

దరఖాస్తు చేసుకోవాలి.. ధర్పల్లి, మార్చి 15 : గృహలక్ష్మి పథకం కింద జీరో కరెంటు బిల్లులు రానివారు మండల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో బాలకృష్ణ ఒక ప్రకటనలో సూచించారు.

ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు.. ఇందల్వాయి, మార్చి 15 : మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో ఎల్లమ్మ ఆలయ ధ్వజారోహణ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు వేడుకలు కొనసాగుతాయని గౌడ సంఘం సభ్యులు తెలిపారు.

హనుమాన్ యజ్ఞం.. సుభాష్‌నగర్, మార్చి 15: నగరంలోని సారంగాపూర్ హనుమాన్ మందిర ప్రాంగణంలో శుక్రవారం యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

నర్సరీల తనిఖీ.. మోపాల్(ఖిల్లీవాడి), మార్చి 15 : మోపాల్ మండలంలోని కులాస్‌పూర్, కంజర గ్రామ నర్సరీలను ఎంపీడీవో లింగంనాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. వేసవి దృష్ట్యా మొక్కల సంరక్షణపై కూలీలు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. చిన్నాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా సమస్య ఉన్నట్లు తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

ఎస్టీపీ-1ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ఎస్టీపీని పరిశీలించిన అర్బన్ ఎమ్మెల్యే

వినాయక్‌నగర్, మార్చి 15: నగర శివారులోని దుబ్బ ప్రాంతంలో ఉన్న మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని (ఎస్టీపీ-1) అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ 2.0 కార్యక్రమం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి రూ.162.81 కోట్లు, తాగునీటి సరఫరాకు రూ. 217 కోట్లు విడుదల చేశాయని తెలిపారు. పనులు టెండర్ స్థాయిలో ఉన్నాయని, త్వరగా పూర్తిచేయించి ఏడాదిలోగా నగర ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఈ తిరుపతి, డీఈఈ నగేశ్ రెడ్డి, ఏఈ యోగేశ్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలిచ్చి నిండాముంచారు..

కోటగిరి, మార్చి 15: తమకు నాసిరకం విత్తనాలను అంటగట్టి నిండా ముంచారని ఆరోపిస్తూ మండల కేంద్రంలోని గ్రోమోర్ ఎదుట రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గ్రోమోర్ వారు గంగాకావేరి వరి విత్తనాలని చెప్పి సోనా 25 రకానికి చెందిన సీడ్స్ అంటగట్టారని తెలిపారు. పక్క పొలంలో వరి కోతకు రాగా.. తమ పంట పొట్ట దశకు కూడా రాలేదని వాపోయారు. ఈ విషయమై 15 రోజుల క్రితం గ్రోమోర్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని తెలిపారు. న్యాయం చేయాలని అడిగితే పొంతన లేని సమాధానం చెబుతున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా రైతులు మండల వ్యవసాయాధికారికి ఫోన్ చేయగా స్పందించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ బస్టాండ్ వద్ద ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకొన్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయాధికారి..కోటగిరి రైతువేదికలో సోమవారం సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు.

కోటగిరిలో ధర్నా చేస్తున్న రైతులు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, అధికారులు

వినియోగదారుల హక్కులను కాపాడుదాం

కంఠేశ్వర్, మార్చి 15 : కలెక్టరేట్‌లో శుక్రవారం పౌర సరఫరాలు, సివిల్ సప్లయిస్ సంస్థ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొని వినియోగదారుల హక్కులు, బాధ్యతలను గుర్తుచేశారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని సూచించారు. ఆర్మూర్ మండల వినియోగదారుల సంఘం ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, జిల్లా వినియోగదారుల సమాఖ్య అధ్యక్షుడు ఎం.రాజేశ్వర్, గుజ్జ రాజేశ్వరి, రేషన్ డీలర్లు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి..

డిచ్‌పల్లి, మార్చి 15 : ప్రతి ఒక్కరూ వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి పద్మావతి సూచించారు. సాంపల్లి, సాంపల్లి తండా పాఠశాలల్లో వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ శిబిరాల ఆధ్వర్యంలో స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు అమూల్య ఎంపిక

డిచ్‌పల్లి, మార్చి 15 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో కొనసాగుతున్న 8వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మిట్టాపల్లి పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని చెల్మిటి అమూల్య ఎంపికైనట్లు హెచ్ఎం సుశీల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను హెచ్ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు గంగామోహన్ తదితరులు అభినందించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

వినాయక్‌నగర్, మార్చి 15: నగరంతోపాటు పలు మండలాల్లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో పట్టుబడినవారిని వారిని నిజామాబాద్ మార్నింగ్ కోర్టులో శుక్రవారం ప్రవేశపెట్టారు. ఒకరికి నిజామాబాద్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ మూడు రోజుల జైలుశిక్ష విధించారు. 17 మందికి మొత్తం రూ. 18,300 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. అంతకు ముందు వారికి ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ కౌన్సెలింగ్ నిర్వహించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చందూర్/ధర్పల్లి/ఏర్గట్ల, మార్చి 15 మోస్రా మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను జడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ ఉమా శ్రీరాములు శుక్రవారం ప్రారంభించారు. ధర్పల్లి మండలం కళాశాల తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నాయకులు ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిన్నబాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఏర్గట్ల మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఉపాధిహామీ పథకం కింద మంజూరైన రూ.20లక్షల వ్యయంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అన్యాయం.. రాజకీయ కుట్ర

ధర్పల్లి, మార్చి 13 : భారత జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కవిత అరెస్టు అన్యాయమని, ఇది రాజకీయ కుట్ర అని ఎంపీపీ సారికా హన్మంత్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు రాజ్‌పాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లిక్కర్ స్కాంలో కవిత పాత్ర ఏమాత్రం లేదన్నారు. తాను వాడిన ఫోన్లన్నీ ఈడీకి అప్పజెప్పినా లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బీజేపీ ఆమెను అరెస్టు చేయించిందని విమర్శించారు. కవితను వెంటనే విడుదల చేయాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నల్ల హన్మంత్‌రెడ్డి, పోతరాజు, సురేశ్, గంగారెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ ప్రారంభం

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మార్చి 15: జిల్లాలోని అన్ని మండలాల్లో శుక్రవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఆయా గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వైద్యాధికారులు వ్యాక్సినేషన్‌ను ప్రారంభించారు. ఏప్రిల్ 6వ తేదీ వరకు రోజుకో గ్రామంలో పశువులకు టీకాలు వేయనున్నట్లు చెప్పారు. కోటగిరి మండలం యాద్గార్‌పూర్, రుద్రూర్ మండలం బొప్పాపూర్ గ్రామాల్లో టీకాల పంపిణీని జిల్లా పశువైద్యాధికారి జగన్నాథాచారి పరిశీలించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, గేదెలు, ఆవులకు తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు.

సికింద్రాపూర్ గ్రామంలో పశువుకు టీకా వేస్తున్న సిరికొండ మండల వైద్యాధికారిణి శిలిష

అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ

క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

నందిపేట్, మార్చి 15 : నడ్కుడ, గాదేపల్లి శివారులోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరీవాహక ప్రాంతంలో అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా అటవీ శాఖకు చెందిన 120 మంది ఉద్యోగులు పర్యటించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పక్షులు, జింకలు సంచరించే ప్రాంతాన్ని పరిశీలించి ఇక్కడి పరిస్థితిని అధ్యయనం చేసినట్లు ఆర్మూర్ ఫారెస్ట్ అధికారి భవానీ శంకర్ తెలిపారు. వన్యప్రాణుల అవశ్యకత, వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను క్షేత్రస్థాయి సిబ్బందికి వివరించారు. సదస్సులో అన్ని రేంజ్‌ల ఆఫీసర్లు శ్రీనివాస్, పద్మారావు, వినయ్, రవి మోహన్ భట్, రవీందర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

బాసర జోన్ పరిధిలో 18 మంది ఎస్సైల బదిలీ

వినాయక్‌నగర్, మార్చి 15: బాసర జోన్ -II పరిధిలో 18 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ మల్టీజోన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ ఎస్సై ఇ.సాయన్నను రెంజల్ ఎస్‌హెచ్‌వోగా, నిర్మల్ జిల్లా బైంసా ఎస్సై మహ్మద్ షరీఫ్‌ను నిజామాబాద్ వన్‌టౌన్ ఎస్సై-2 గా బదిలీ చేశారు. నిజామాబాద్ సీసీఎస్ ఎస్సై డి.రమేశ్‌ను ఆరో టౌన్ ఎస్‌హెచ్‌వోగా, డిచ్‌పల్లి ఎస్సై-2 మనోజ్‌కుమార్‌ను ఇందల్వాయి ఎస్‌హెచ్‌వోగా, సస్పెన్షన్‌లో ఉన్న ఇందల్వాయి ఎస్సై మహేశ్‌ను సస్పెన్షన్ అనంతరం వీఆర్‌కు బదిలీచేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఐదో టౌన్ ఎస్‌హెచ్‌వో జి.అప్పారావును రుద్రూర్ ఎస్‌హెచ్‌వోగా, నిజామాబాద్ టూ టౌన్ ఎస్సై జి.అశోక్‌ను ఐదోటౌన్‌కు, సీసీఎస్ ఎస్సై ఎల్.రామును టూ టౌన్‌కు ఎస్సై-1గా, ఎడపల్లి ఎస్‌హెచ్‌వో బి.విక్రమ్‌ను ధర్పల్లి ఎస్‌హెచ్‌వోగా, ధర్పల్లి ఎస్‌హెచ్‌వో వంశీకృష్ణను ఎడపల్లి ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న పాండేరావును ఐదోటౌన్ ఎస్సై-2గా, సీఎస్‌బీలో అటాచ్డ్ ఎస్సైగా ఉన్న సంతోష్‌రెడ్డి, ఎస్‌బీ అటాచ్డ్ ఎస్సై సాయన్నకు పూర్తిస్థాయి పోస్టింగ్ కల్పించారు. నిర్మల్ ఎస్‌బీ అటాచ్డ్ ఎస్సై సక్రియానాయక్‌కు స్థానిక ఎస్‌బీలో పోస్టింగ్ కల్పించారు. నిజామాబాద్ ఎస్‌బీ ఎస్సై శివాజీని నిర్మల్ సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఎస్సై విఠల్‌ను నిర్మల్ ఎస్‌బీకి, ఆదిలాబాద్ ట్రాఫిక్ ఎస్సై-2 సాయన్నను నిజామాబాద్ ఎస్‌బీకి, నిజామాబాద్ పీసీఆర్ ఎస్సై ఎండీ నజీబ్‌ను ఆదిలాబాద్ ఎస్‌బీకి బదిలీ చేశారు.

పంచాయతీ కార్యదర్శిపై యువకుడి దాడి

ఎడపల్లి, మార్చి 15: పంచాయతీ కార్యదర్శిపై ఓ యువకుడు దాడి చేసిన ఘటన అంబం(వై) గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు అంబం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ కథనం ప్రకారం.. కార్యదర్శి గ్రామ పంచాయతీలో విధులు నిర్వర్తిస్తుండగా గ్రామానికి చెందిన పవన్ వచ్చాడు. తన వీధిలో విద్యుత్ దీపాలు వెలగడం లేదంటూ దుర్భాషలాడుతూ కార్యదర్శిపై చేయి చేసుకున్నాడు. కార్యదర్శి తప్పించుకుని ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నాడు. అక్కడికి సైతం నిందితుడు చేరుకొని ఎంపీడీవో గోపాల కృష్ణ ఎదుటే కార్యదర్శిపై కుర్చీతో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని స్టేషన్‌కు తరలించారు.

నిజామాబాద్‌లోనే పసుపుబోర్డు

కమ్మర్‌పల్లి, మార్చి 15: మండలంలోని చౌట్‌పల్లి గ్రామంలో బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ అర్వింద్ పాల్గొన్నారు. పసుపు పంటకు మద్దతు ధర రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు. జాతీయ పసుపు బోర్డు కార్యాలయం నిజామాబాద్‌లోనే ప్రారంభం అవుతుందని అన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గది ప్రారంభం

అదనపు తరగతి గది వద్ద ఎంపీపీ లావణ్య, నాయకులు

బాల్కొండ, మార్చి 15: కిసాన్‌నగర్ గ్రామంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సహకారంతో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదిని ఎంపీపీ లావణ్య, ఎంపీటీసీ రామరాజుగౌడ్ శుక్రవారం ప్రారంభించారు. ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంఈవో రాజేశ్వర్, మాజీ ఎంపీపీ నాగభూషణ్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, సీనియర్ అసిస్టెంట్ నవీన్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కపిల్, బీఆర్ఎస్ నాయకులు లింగాగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి కృషి చేస్తా

ఆర్మూర్‌టౌన్, మార్చి15: అందరి సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని ఇన్‌చార్జి చైర్మన్ షేక్ మున్నా అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఇన్‌చార్జి చైర్మన్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 38 అంశాలకు గాను 36 అంశాలను ఏకగ్రీవంగా తీర్మానించారు. రెండు అంశాలపై నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు ఇన్‌చార్జి చైర్మన్ తెలిపారు. వార్డుకు రూ.5 లక్షల చొప్పున నిధులు కేటాయించి 36 వార్డుల్లో అత్యవసర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ షేక్ మున్నా

ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సంతోష్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

కమ్మర్‌పల్లి, మార్చి 15: నూతన గోదాం నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేసిన సందర్భంగా ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి చిత్రపటాలకు సొసైటీ చైర్మన్ సామ బాపు రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కోనసముందర్ వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాలేరు శేఖర్, మాజీ ఉపసర్పంచ్ పేరం లింబాద్రి, సొసైటీ డైరెక్టర్ బండి నారాయణ, ఇటుకల శ్రీనివాస్, బలేరామ్ నర్సయ్య, సీఈవో రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎంపీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సంక్షిప్తంగా..

● **అంబేద్కర్ సంఘ కార్యవర్గం** -భీమ్‌గల్, మార్చి 15: మండలంలోని బడాభీమ్‌గల్‌లో అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిత్తరి రాజేశ్వర్ (కాలే), క్యాషియర్‌గా చిత్తరి ఆనంద్, రైటర్‌గా కొండూరి నవీన్, సెక్రటరీగా కొండూరి గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

● **కార్యవర్గం ఎన్నిక**- శక్కర్‌నగర్, మార్చి 15: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ 103 బోధన్ వాసవీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని బోధన్‌లోని నగరేశ్వర మందిరం వద్ద ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ మకరంద్ జామ్‌కార్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సూర్యారావు, కోశాధికారిగా డాక్టర్ చకిలం సురేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలిగా డాక్టర్ శాంతి, ప్రధాన కార్యదర్శిగా మకరంద్ అంజలీ జామ్‌కార్, కోశాధికారిగా చక్రం రాజశ్రీని ఎన్నుకున్నారు.

● **విచారణ చేపట్టాలి**- ఆర్మూర్‌టౌన్, మార్చి15: పట్టణంలో ఇండ్ల నంబర్ల కేటాయింపు, మున్సిపల్ మోటర్ల మరమ్మతులపై విచారణ చేపట్టాలని కౌన్సిలర్ జీవీ నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.

● **18న వాహనాల వేలం**- ఆర్మూర్‌టౌన్, మార్చి15: ఆర్మూర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో ఆరు ద్విచక్ర వాహనాలకు ఈనెల 18న వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు.

● **గృహజ్యోతి పథకం ప్రారంభం**- ఆర్మూర్‌టౌన్, మార్చి15: చేపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గృహజ్యోతి పథకాన్ని శుక్రవారం ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు ఉన్న వారందరికీ రూ.500 లకే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తున్నట్లు తెలిపారు. రూ.500లకు సిలిండర్‌ను, జీరో విద్యుత్ బిల్లును పలువురు అభ్దిదారులకు అందించారు.

● **బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు**- ఆర్మూర్‌టౌన్, మార్చి15: మామిడిపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు దాటుతున్న వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. తీవ్ర గాయాలపాలైన వృద్ధుడిని కండక్టర్, స్థానికులు ఆటోలో ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రవి కుమార్ తెలిపారు.

దొంగకు దేహశుద్ధి

శక్కర్‌నగర్, మార్చి 15: బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు ఆటోనగర్‌లో పంపుసెట్ల కేబుల్ వైర్లు, స్టార్టర్లు చోరీకి పాల్పడుతున్న దుండగుడిని కాలనీవాసులు పట్టుకున్నారు. కాలనీకి చెందిన పలువురు ప్రశ్నించినా నిందితుడి వివరాలు చెప్పకపోవడంతో దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టి నిందితుడి వివరాలు రాబడుతామని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు.

మొరం ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం

మాక్లూర్, మార్చి16: కొత్తపలి శివారులోని చెరువు శిఖం నుంచి అక్రమంగా మొరం తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి, సీఐ అంజయ్య దాడులు నిర్వహించారు. ఆరు ట్రాక్టర్లు, ఒక జేసీబీని పట్టుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్లు, జేసీబీని ఎస్సై సుధీర్‌రావుకు అప్పగించారు.

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

బోధన్/వర్ని, మార్చి 15: రాష్ట్ర ప్రభుత్వం కమ్మ కులస్తుల కోసం ప్రత్యేకంగా కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుచేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బోధన్ పట్టణంలో శుక్రవారం కమ్మ కులస్తులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సంబురాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలను ప్రదర్శించారు. పటాకులు కాల్చి, స్వీట్లను ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. బోధన్ కమ్మ సంఘం అధ్యక్షుడు పల్లెంపాటి శివన్నారాయణ, కోశాధికారి పరుచూరి శ్రీధర్, రిటైర్డ్ ఎంఈవో బాలగంగాధర్ రావు, రావెళ్ల శ్రీనివాస్, కమ్మ సంఘం నాయకులు పాల్గొన్నారు. వర్నిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కమ్మ కులస్తులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బోధన్ డివిజన్ కమ్మ సంఘం అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, వర్ని కమ్మ సంఘం కార్యదర్శి గణపతి, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

ఏర్గట్ల, మార్చి 15: తడ్‌పాకల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. సోషల్ ఉపాధ్యాయుడు గంగాధర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఓటు విలువ విద్యార్థులకు తెలిపేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

వంద శాతం పన్నులు వసూలు చేస్తాం

రెంజల్, మార్చి 15: జిల్లాలో బకాయిపడిన ఇంటి పన్నులను ఈనెల31 నాటికి వందశాతం వసూలు చేసేందుకు జీపీ కార్యదర్శులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రెంజల్, నీలా గ్రామాల్లో జరుగుతున్న తాగునీటి పైపులైన్ పనులను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్‌నాయక్, ఆర్‌డబ్ల్యూ ఎస్ డీఈ మున్నినాయక్, మండల పర్యవేక్షకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేత

కమ్మర్‌పల్లి, మార్చి 15: బాసరకు చెందిన సాయినాథ్ బాసర సరస్వతి అమ్మవారి వద్ద పూజించిన పరీక్ష ప్యాడ్లు, పెన్నులను బషీరాబాద్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు అందించారు. వాటిని మాజీ సర్పంచ్ సక్కారం అశోక్, వీడీసీ అధ్యక్షులు భాజన్న, హెచ్ఎం కనకగంగాధర్ శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ విక్రమ్ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సభ

వేల్పూర్, మార్చి 15: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బీమా జమున అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలను అధికారులు వివరించారు. నూతన ఎంపీడీవో బాలకిషన్‌ను సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సురేశ్, అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

మహాజన సభ

నవీపేట (రెంజల్), 15: నవీపేట మండలం బినోల గ్రామ సహకార సంఘంలో 61వ మహాజన సభ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు ఆధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఏప్రిల్ 2023 నుంచి సెప్టెంబర్ 2023 వరకు సంఘం నిర్వహించిన లావాదేవీలను సీఈవో రమేశ్ చదివి వినిపించారు. పలు అంశాలను తీర్మానించారు. విండో